# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- మక్తపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 8: గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని మక్తపల్లిలో నూతన గ్రామపంచాయతీ భవనం, మహిళా సమైక్య భవనం, వైకుంఠధామం, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మక్తపల్లి గ్రామం నూతనంగా ఏర్పడ్డ పంచాయతీ కావడంతో ఒక్కొక్కటిగా పనులు చేసుకుంటున్నామని తెలిపారు. గ్రామంలో ఒకప్పుడు తాగు నీరు లేక ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. ఇప్పుడు కాళేశ్వరం జలాలతో బీడుగా ఉన్న భూములను సాగులోకి తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. ఎటు చూసినా పచ్చని పొలాలతో గ్రామం కళకళలాడుతుందని హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యేకు సర్పంచ్ ఆధ్వర్యంలో మహిళలు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, సర్పంచ్ గాండ్ల భాగ్యలక్ష్మి, ఉప సర్పంచ్ పారిపల్లి రాజిరెడ్డి, నాయకులు గాండ్ల శ్రీనివాస్, చింతం చంద్రయ్య, పెంట చంద్రయ్య ఉన్నారు.



మక్తపల్లిలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల పంపిణీ



జర్నలిస్టుల ఇండ్ల స్థలాల పంపిణీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల

కార్పొరేషన్, అక్టోబర్ 8: కరీంనగర్ జిల్లా కేంద్రంలో పని చేస్తున్న జర్నలిస్టులకు ఆదివారం సాయంత్రం ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఇండ్ల స్థలాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 120 మంది జర్నలిస్టులకు ఒకేసారి ఇళ్ల స్థలాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఎంతో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులకు స్థలాలను అందించడం సంతోషంగా ఉందన్నారు. దశలవారీగా అర్హులైన జర్నలిస్టులందరికీ కూడా ఇండ్ల స్థలాలను అందిస్తామని తెలిపారు. అనునిత్యం ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచే జర్నలిస్టులు అనేక మంది ఇంకా సొంత ఇండ్లు కూడా లేని పరిస్థితుల్లో ఉన్నారని, వీరిని గుర్తించి ఇండ్ల స్థలాలను అందించామన్నారు. వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తుమని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, ఆర్డీవో మహేశ్వర్, జర్నలిస్టుల కుటుంబసభ్యులు ఉన్నారు.



సమావేశానికి హాజరైన జర్నలిస్టుల కుటుంబసభ్యులు

# అభివృద్ధి, ఆహ్లాదానికి కేరాఫ్‌గా కరీంనగర్

- భవిష్యత్ తరాలకు అద్భుత నగరాన్ని అందిస్తా
- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్
- కేబుల్ బ్రిడ్జిపై ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై అవగాహన మారథాన్
- పాల్గొన్న 3వేల మంది

కొత్తపల్లి, అక్టోబర్ 8: తెలంగాణ ఆవిర్భవించిన దశాబ్ది కాలంలోనే అభివృద్ధికి కేరాఫ్‌గా కరీంనగర్ జిల్లా మారిందని రాష్ట్ర బీసీ సంక్షేమ పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు . 'మనకోసం మన కరీంనగర్ కోసం' అన్న నినాదంతో కరీంనగర్ జిల్లా ప్రజలకు ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించడానికి కరీంనగర్ రన్నర్స్ అండ్ సైక్లిస్ట్ అసోసియేషన్ ఆదివారం ఉదయం నిర్వహించిన మారథాన్‌ను కేబుల్ బ్రిడ్జి వద్ద మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్, కమిషనర్‌తో కలిసి బ్రిడ్జిపై నడిచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. జిల్లాకే తలమానికంగా నిర్మిస్తున్న రివర్ ఫ్రంట్ పనులు ఒకసారి పూర్తయ్యాయి అంటే ఆధ్యాత్మికంగా, అభివృద్ధి, ఆహ్లాదానికి కేరాఫ్‌గా కరీంనగర్ జిల్లా నిలుస్తుందని అన్నారు. గతంలో అభివృద్ధికి నోచుకోకపోవడంతో కరీంనగర్ జిల్లా అనగానే పనిష్‌మెంట్ ఇవ్వాలంటే జిల్లాకు పంపించాలని భావించేవారని గుర్తు చేశారు. కరీంనగర్ జిల్లా అంటే పనిష్మెంట్లకు కేంద్రం కాదని జిల్లాకు రావాలి అని కోరుకునే విధంగా తీర్చిదిద్దాలని అనుకున్నానని తెలిపారు. ఒకప్పుడు జిల్లాలో రోడ్లపై చెత్తాచెదారం, మురుగు వాటి చుట్టూ పందులు స్వైర విహారం చేసేవి అన్నారు. కానీ ఇప్పుడు హైదరాబాద్ తర్వాత అభివృద్ధి చెందిన జిల్లాగా కరీంనగర్ రూపాంతరం చెందిందన్నారు. ఒకవైపు ఐటీ టవర్ మరొక వైపు మెడికల్ కళాశాల, వేంకటేశ్వర స్వామి ఆలయం, శ్రీకృష్ణుడి టెంపుల్ నిర్మాణాలతో భావితరానికి అద్భుతమైన నగరాన్ని అందించే విధంగా కరీంనగర్ జిల్లా రూపాంతరం చెందుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ డాక్టర్ బి గోపి మాట్లాడారు. కరీంనగర్‌లో ఇలాంటి కార్యక్రమాలను మరిన్నీ నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యం, ఫిట్నెస్‌పై మరింత ఆసక్తి పెంపొందించాలని సూచించారు. కరీంనగర్ రన్నర్స్ అండ్ సైక్లిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు పి మహేశ్ మాట్లాడుతూ మారథాన్‌లో పదేండ్ల వయసు నుంచి వయోవృద్ధుల వరకు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారని తెలిపారు. తొలిసారి కరీంనగర్‌లో మారథాన్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు ఆరోగ్యం ఫిట్నెస్‌పై అవగాహన కల్పించామన్నారు. చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా 10 కి.మీ, 21కి.మీ కేటగిరీలలో మహిళలకు, పురుషులకు విడివిడిగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వజ్ర హాస్పిటల్స్ డాక్టర్ సుమన్ దంపతులు, ఐవీవై, సిద్ధార్థ స్కూల్ చైర్మన్లు అందజేశారు. కార్యక్రమం లో సీపీ సుబ్బారాయుడు, కరీంనగర్ రన్నర్స్ అండ్ సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.





కరీంనగర్‌లో మారథాన్‌ను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్, మారథాన్‌లో భారీగా పాల్గొన్న ప్రజలు

# రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి

- డాక్టర్ బోయినిపల్లి మాధవి, వొడితల శమిత
- మహిళా ప్రజా ప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళనం



మహిళా ప్రజాప్రతినిధులతో సమావేశమైన బోయినిపల్లి మాధవి, ప్రొఫెసర్ శమిత

చిగురుమామిడి, అక్టోబర్ 8: రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని డాక్టర్ బోయినిపల్లి మాధవి, వొడితల శమిత మహిళలకు పిలుపునిచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న బడుగు, బలహీన వర్గాల సంక్షేమ పథకాలతో పాటు మహిళా సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని మహిళలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాశికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మహిళలను కోరారు. సమావేశానికి నియోజకవర్గానికి చెందిన మహిళా ప్రజాప్రతినిధులు, మండల మహిళా నాయకులతో పాటు చిగురుమామిడి ఎంపీపీ కొత్త వినీతా శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు అందె సుజాత, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్పర్సన్ రామోజు రజిత, ఎంపీటీసీలు కొత్తూరు సంధ్య, పెసరి జమున, మంకు స్వప్న, మహిళా నాయకురాళ్లు గొల్లపల్లి అరుణ, సదా శ్రీలత, అప్పాల యశోద, చింతపూల శ్యామల, కొమ్మెర మంజుల, సాగరిక, పద్మ, విజయ తదితరులున్నారు.

# మరో కోనసీమగా రామడుగు మండలం

- చివరి మడివరకు అందనున్న కాళేశ్వరం జలాలు
- చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

రామడుగు, అక్టోబర్ 8: రామడుగు మండలాన్ని మరో కోనసీమగా తీర్చిదిద్దనున్నట్టు చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. గంగాధర మండలం బూర్గుపల్లిలోని తన నివాసంలో నియోజకవర్గంలోని గంగాధర మండలం నాగిరెడ్డిపూర్, రామడుగు మండలం రామడుగు, కొరటపల్లి, రుద్రారం, దత్తోజీపేట, చొప్పదండి మండలం గుమ్లాపూర్‌లో 144.22 ఎకరాల వ్యవసాయ భూములను కోల్పోతున్న రైతులకు ₹50 కోట్ల చెక్కులను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నాడు పంటలు ఎండిపోయి, అప్పుల పాలైన రైతుల కండ్లల్లో కన్నీళ్లు పారాయని, నేడు నెర్రెలు బారిన నేలల్లో కాళేశ్వరం జలాలు పారుతున్నాయని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేదన్నారు. వనరులు పుష్కలంగా ఉన్నా, మన ప్రాంతం కరువుతో అల్లాడిపోయిందని వాపోయారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ రూపకల్పనతో తెలంగాణ సస్యశ్యామలమైందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నియోజకవర్గంలోని వరదకాలువ తొమ్మిది అడుగుల నీటితో కళకళ లాడుతోందన్నారు. మోతె కాలువలు పూర్తయిన తరువాత రామడుగు మండలం గోదావరి జిల్లాల్లోని కోనసీమకు దీటుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఓటీల నిర్మాణం కోసం మంజూరైన నిధులు సోమవారం నుంచి రైతులకు అందిస్తామన్నారు. అలాగే రామడుగు మండలం దత్తోజీపేటలో ₹4లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు, గోపాల్‌రావుపేటలో ₹16 లక్షలతో నిర్మించే పలు కులసంఘ భవనాలకు ఎమ్మెల్యే ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక భూ సేకరణ విభాగం నాయబ్ తహసీల్దార్ కిరణ్‌కుమార్‌రెడ్డి, రామడుగు మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బండ అజయ్‌రెడ్డి, రామడుగు, చొప్పదండి మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గంట్ల జితేందర్‌రెడ్డి, వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, కొండగట్టు దేవస్థానం డైరెక్టర్ దాసరి రాజేందర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు కొలిపాక మల్లేశం, మచ్చ గంగయ్య, కొడిమ్యాల రాజేశం, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



దత్తోజీపేటలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్